క్లుప్తంగా

ఆలయాల శుద్ధి



పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరు చౌడేశ్వరి ఆలయం, శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాథస్వామి ఆలయం, పలు ఆలయాల్లో చంద్రగ్రహణం ముగిసిన సందర్భంగా ఆదివారం ఉదయం అర్చకులు శుద్ధి చేశారు. అనంతరం అభిషేకం, సంప్రోక్షణ, అలంకరణ, నైవేద్యం, కర్పూర హారతి సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

బీఎస్పీ నాయకుల ప్రచారం



పెబ్బేరు రూరల్: బీఎస్పీ ఆధ్వర్యంలో శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురంలో ఆదివారం ఇంటింటికి బీఎస్పీ కార్యక్రమం చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు కృష్ణ, అసెంబ్లీ కార్యదర్శి ఎల్లస్వామి, మండల ఉపాధ్యక్షుడు గుడిసె ధర్మ ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల్లో ఏనుగు గుర్తుకు ఓటు వేసి వనపర్తి నియోజకవర్గంలో బీసీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం గ్రామంలో పలువురు బీఎస్పీలో చేరారు. వారికి జిల్లా అధ్యక్షుడు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో శ్రీను, రాంబాబు, విష్ణు, సురేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బీసీలకు అన్యాయం



మదనాపురం: పార్టీ అభ్యర్థుల ఎంపికలో బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడారు. దేవరకద్ర నియోజకవర్గంలో 30 ఏళ్లుగా పార్టీకి పనిచేసిన కాటం ప్రదీప్‌కుమార్‌కు కాకుండా మధుసూదన్‌రెడ్డికి టికెట్ కేటాయించడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన అభ్యర్థిగా అధిష్టానం మరోసారి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రామచంద్రయ్య, రాజకుమార్, రాము పాల్గొన్నారు.

ప్రకాష్‌రెడ్డిని కలిసిన వాకిటి శ్రీహరి



అమరచింత: మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డిని మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి ఆదివారం మర్యాద పూర్వకంగా హైదరాబాద్ కలిశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి అయ్యుబ్‌ఖాన్, విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఆయనను సత్కరించారు. అసెంబ్లీ ఎన్నికలలో తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

తరలిన నాయకులు

పెబ్బేరు రూరల్: జిల్లా కేంద్రంలోని ఆదివారం మేగారెడ్డి మద్దతుగా నిర్వహించిన కాంగ్రెస్ నాయకుల మండలంలోని బునాదిపురం, కంచిరావుపల్లి నుంచి కాంగ్రెస్ నాయకులు, యువకులు తరలివెళ్లారు.

బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ చెందిన పుట్టపాగ రాములు వారం రోజుల క్రితం హైదరాబాద్‌లో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్, మండల కోఆప్షన్ సభ్యుడు హలీంపాషా ఆదివారం పరామర్శించి బియ్యాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చండి

మహబూబ్‌నగర్ రూరల్: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతామని మేనిఫెస్టోలో పెట్టి అమలు చేస్తామని హామీ ఇచ్చే పార్టీకే తమ మద్దతు ఉంటుందని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి, రాష్ట్ర కో–కన్వీనర్ బండలయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సమితి యువజన విభాగం అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నూతన అధ్యక్షుడిగా నాగన్న, గౌరవ అధ్యక్షుడిగా శివన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా చాకలి రాజు, ప్రధాన కార్యదర్శిగా సతీష్, ఉపాధ్యక్షుడిగా భాస్కర్‌లు ఎన్నికయ్యారు. మనోహర్, గోవిందమ్మ పాల్గొన్నారు.

ప్రారంభమైన వరి కోతలు

- మండలంలో 14,780 ఎకరాల్లో వరి సాగు
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం



ఖిల్లాఘనపురంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. వారం రోజుల నుంచి అక్కడక్కడ ప్రారంభించగా, భూమి ఆరడంతో రెండు రోజుల నుంచి కోతలు ముమ్మరం చేశారు. ఈ సంవత్సరం ఆది నుంచి వర్షాలు లేకపోయిన మండలంలోని పలుగ్రామాల మీదుగా ప్రవహిస్తున్న పెద్ద వాగుకు కల్వకుర్తి లిఫ్టు నుంచి కృష్ణా నీటిని వదలడంతో పంటలకు ఎలాంటి ఇబ్బందులు కాలేదు. ఈ సంవత్సరం మండలంలో ఎక్కువగా ఆర్ఎన్ఆర్, 1010, బయోసీడ్ తదితర వరి వంగడాలను సాగు చేశారు.

14,780 ఎకరాల్లో వరిసాగు

మండలంలో ఈ సంవత్సరం మొత్తం 14,780 ఎకరాల్లో వరిసాగు చేసినట్లు అధికారులు ధ్రువీకరించారు. వర్షాలు సక్రమంగా కురవకపోయినప్పటికి కేఎల్ఐ నీళ్లతో మండలంలోని చాలా గ్రామాల చెరువులు నిండాయి. దీంతో బోరుబావుల్లో నీరు పెరగడంతో పాటు చెరువుల కింద రైతులు వరి పంటను సాగు చేశారు. మండలంలో వర్షాభావ పరిస్థితులతో మెట్టపంటలు నష్టాలు తెచ్చిన వరి మాత్రం పర్వాలేదనేలా ఉంది.

త్వరలోనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



మండలంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. అవసరమైన అన్ని గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాల కోసం ఏర్పాట్లు చేస్తున్నాం. సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ సమావేశం నిర్వహిస్తారు. నవంబర్ మొదటి వారంలో కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. కోతలు పూర్తి చేసుకున్న రైతులు పంటను తేమ ఉండకుండా ఆరబెట్టుకోవాలి.

– మల్లయ్య, మండల వ్యవసాయ అధికారి, ఖిల్లాఘనపురం

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బీరం



రేచింతలలో ప్రచారం చేస్తున్న నాయకులు

పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్ చెందిన వివిధ పార్టీల నాయకులు ఆదివారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పాత, కొత్త తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, జ్యోతినందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోంది

గోపాల్‌పేట: సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి ముందుచూపుతో వనపర్తి నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మంత్రి ముందుచూపుతో వనపర్తిలో మెడికల్ కాలేజీ, ఇంజినీరింగ్, అగ్రి, ఫిషరీస్, నర్సింగ్ కాలేజీల ఏర్పాటుకు కృషి చేశారన్నారు. జిల్లాలో 1.25లక్షల ఎకరాలకు సాగునీరందిస్తున్నారని తెలిపారు. మొదటి విడతలో వంద దళితబంధు యూనిట్లు పంపిణీ చేశారని, రెండో విడతలో పథకానికి అర్హులను ఎంపిక చేయగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేసు వేయడంతో నిలిచిపోయిందని తెలిపారు. 10,303 కల్యాణలక్ష్మి, 713 షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్య, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయ్యండి

ఆత్మకూర్: రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసి దేశం గర్వించే స్థాయికి నిలబెట్టిన కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం గ్రామాల్లో బీఆర్ఎస్ గ్రామకార్యవర్గాలను ఏర్పాటు చేశారు. ఎంపీపీ బంగారు శ్రీను, శ్రీధర్‌గౌడ్, జెడ్పీటీసీ శివరంజని, వింగ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటేష్ తదితరులు అభ్యర్థి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేపట్టారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని అయ్యవారిపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

ఆదమరిస్తే అంతే..



అమరచింత: ఆత్మకూర్–మరికల్ ప్రధాన బీటీ రహదారి దెబ్బతింటున్న ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోవడం లేదు. అమరచింత నుంచి ఆత్మకూర్‌కు వెళ్తున్న బీటీ రహదారిలో సిద్ధార్థ పాఠశాల సమీపంలో ధ్వంసమై గుంతలు పడ్డాయి. దీంతో వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదకరంగా మారిన గుంతలను వెంటనే పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

‘వర్గీకరణ జరిగే వరకు పోరాటం’



ఆత్మకూర్: నిజమైన దళితులు అన్నిరంగాల్లో వెనుకబడిపోతున్నారని.. వర్గీకరణ చేపట్టి న్యాయం జరిగే దాకా పోరాటం కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్రకార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్ తెలిపారు. ఆదివారం మండలంలోని ఆరేపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలో ప్రభుత్వాలు ఏర్పడి పదేళ్లవుతున్నా నేటికీ వర్గీకరణ చేపట్టకపోవడం విచారకరమన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తలపెట్టిన రథయాత్రకు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లాలు మాదిగా, ప్రధానకార్యదర్శిగా ఆంజనేయులు, మరో 10 మందిని కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు అజ్జపాగ మాసన్న, కట్టెల మిషన్ రాజు, గాలిపంపు శ్రీను, కర్రె శ్రీను, జానకిరాం, సోంబాబు, దండు శ్రీను, రేవల్లి శ్రీను తదితరులు ఉన్నారు.

పాఠశాలలో ఫర్నీచర్‌కు నిప్పు



అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని తరగతి గదిలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నిప్పు పెట్టడంతో ఫర్నీచర్ తగలబడిపోయింది. గ్రామస్తులు గమనించి హెచ్ఎం బలరాంను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. దీంతో మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం అందించారు. కమిషనర్ తమ సిబ్బందిని పాఠశాలకు పంపడంతో పాటు సకాలంలో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పడంతో అదుపులోకి వచ్చాయి. సంఘటనకు కారణంపై ఆరా తీస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వెల్లడించారు.

హైవే పైనే ‘ఎక్స్‌ప్రెస్’ సేవలు

- అడ్డాకుల బస్టాండ్‌లోకి రాని బస్సులు
- జాతీయ రహదారిపైనే ప్రయాణికులను ఎక్కించుకుంటున్న డ్రైవర్లు



అడ్డాకుల వద్ద రహదారి పైనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

అడ్డాకుల: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఉన్నప్పటికీ కొన్ని డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు బస్టాండ్‌లోకి రావడం లేదు. గద్వాల డిపోకు చెందిన హైదరాబాద్ వెళ్లే బస్సులు అడ్డాకుల బస్టాండ్‌లోకి వెళ్లడం లేదు. హైవే పైనే ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నాయి. అడ్డాకులకు బస్సు టికెట్ ఇస్తూ ఇక్కడ బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక వనపర్తి డిపోకు చెందిన బస్సులు కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్లే సమయంలో అడ్డాకుల బస్టాండ్‌లోకి రావడం లేదు. దీనివల్ల హైదరాబాద్ వెళ్లాలనుకునే ప్రయాణికులు ప్రధాన రహదారిపై బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. కేవలం గద్వాల, వనపర్తి డిపోలకు చెందిన మహబూబ్‌నగర్ వెళ్లే బస్సులు మాత్రమే ఆర్టీసీ బస్టాండ్‌లోకి వస్తున్నాయి. వనపర్తి డిపో నుంచి కొత్తకోట మీదుగా హైదరాబాద్ వెళ్లే బస్సులు అడ్డాకుల బస్టాండ్‌లోకి వచ్చి వెళ్తున్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి గద్వాల, వనపర్తి డిపోలకు చెందిన అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులను అడ్డాకుల బస్టాండ్‌లోకి వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మూసాపేట వద్ద నిలపరా..?

మూసాపేట మండల కేంద్రంగా ఏర్పడినా వనపర్తి, గద్వాల డిపోలకు చెందిన బస్సులు మూసాపేట వద్ద నిలపడం లేదు. హైదరాబాద్, కర్నూల్ వైపు వెళ్లే ప్రయాణికులు రహదారిపై బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే చాలామంది భూత్పూర్ వరకు వెళ్లి అక్కడ హైదరాబాద్ వెళ్లే బస్సుల్లో వెళ్తున్నారు. మూసాపేటతో పాటు నిజాలాపూర్, సంకలమద్ది, వేముల, దాసర్‌పల్లి, నందిపేట, మహ్మదుస్సేన్‌పల్లి గ్రామాలకు చెందిన ప్రయాణికులు హైదరాబాద్ వెళ్లడానికి మూసాపేటకే వస్తారు. ఈక్రమంలో రహదారిపై గద్వాల, వనపర్తి డిపోలకు చెందిన అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులు మూసాపేట వద్ద నిలిపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మూసాపేట వద్ద ఎక్స్‌ప్రెస్‌లు నిలపాలి



మూసాపేట వద్ద జాతీయ రహదారిపై గద్వాల, వనపర్తి డిపోకు చెందిన హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలపడం లేదు. చాలా మంది భూత్పూర్ వెళ్లి అక్కడ హైదరాబాద్ బస్సుల్లో వెళ్లిపోతున్నారు. హైదరాబాద్, కర్నూల్ వెళ్లే అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులను మూసాపేట వద్ద నిలపాలి.

–షేక్ పాషా, మూసాపేట

బస్టాండ్‌లోకి రావాలి



గద్వాల డిపోకు చెందిన హైదరాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులు అడ్డాకుల బస్టాండ్‌లోకి రావడం లేదు. దీంతో హైదరాబాద్, కర్నూల్ వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం హైవేపై నిలబడుతున్నారు. దీనివల్ల ప్రయాణికులకు ప్రమాదం కూడా పొంచి ఉంది.

–బాలరాజు, అడ్డాకుల

వారబందీ ఎత్తేసి.. నీళ్లివ్వండి



డి-6 కాల్వలో పేరుకుపోయిన రాళ్లను తొలగిస్తున్న రైతులు

ఆత్మకూర్: పంటలు కోతల సమయంలో సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే సాగునీరు ఇవ్వాలని డి-6 ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఆదివారం తూంపల్లి, వీరరాఘవపురం, రేచింతల రైతులు డి-6 కాలువలో పేరుకుపోయిన రాళ్లు, రప్పలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. పంటలు చేతికి వచ్చే సమయంలో సాగునీరు అందక పంటలు ఎండుతుంటే వారబంధి పేరిట నీటిసరఫరాను నిలిపివేయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాల్వలకు గండ్లు పడి నీరు వృథాగా పోతుందని, గతంలో కూడా చాలా సందర్భాల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని తెలిపారు. పీజేపీ అధికారుల పర్యవేక్షణ లోపం రైతులకు శాపంగా మారిందన్నారు. డి-6 కాల్వ పరిధిలోని జూరాల, గుంటిపల్లి, మోట్లంపల్లి, ఆరేపల్లి, కత్తేపల్లి, తూంపల్లి, వీరరాఘవపూరం, రేచింతలలో 10వేల ఎకరాల్లో పంటలు ప్రశ్నార్థకంగా మారాయని తెలిపారు. వారబందీని ఎత్తేసి వెంటనే సాగునీరు విడుదలచేసి పంటలను కాపాడలని రైతులు యాదయ్య, కృష్ణయ్య, రవి, నరేష్, గోపాలకృష్ణ, మహానంది, కృష్ణారెడ్డి తదితరులు కోరారు.

పాఠశాలలో కుళాయిల వద్ద దుర్గంధం



పాఠశాలలో కొళాయిల దుస్థితి

అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో తాగునీటి కొళాయిల వద్ద అపరిశుభ్రత నెలకొంది. కొళాయి పరిసరాల్లో మురుగు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తుంది. మధ్యాహ్న భోజనంతో పాటు విద్యార్థులకు తాగునీటిని అందించేందుకు రూ.లక్ష వెచ్చించి ఏర్పాటు చేసిన కొళాయిల పరిస్థితి దయనీయంగా మారింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విషయాన్ని పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లితండ్రులు తెలిపారు. మున్సిపల్ కేంద్రంలో ఇలాంటి పరిస్థితి ఏంటని, అధికారులు స్పందించి పరిసరాలు శుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

జీవనాధారమైన ‘పుట్టీ’ని కాల్చేశారు



కాలిపోయిన పుట్టీ

జోగుళాంబ శక్తిపీఠం: ప్రతి రోజు అలంపూర్ ఆలయాలకు దర్శనం కోసం వచ్చే భక్తులు సరదగా కాలక్షేపం కోసం పుష్కరఘాట్ దగ్గర తుంగభద్ర నదిలో పుట్టీ ప్రయాణం చేస్తుంటారు. అలా నదిలో పుట్టి ప్రయాణానికి తీసుకెళ్తూ పొట్టపోసుకుని బతుకుతున్న నేరెడబోయిన రాముడికి చెందిన పుట్టీని గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి తగులబెట్టారు. ఉదయం నది వద్దకు వెళ్లిన రాముడు తగలబడి ఉన్న పుట్టీని చూసి పుట్టెడుదుఖంతో కుంగిపోయాడు. తనకు జరిగిన అన్యాయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నాడు. గతంలో కూడా ఇలాంటి పుట్టీలను తగుల బెట్టిన సంఘటనలు తుంగభద్ర నది ఒడ్డున చాలా ఉన్నాయి.

రహదారిపై పారిన నీరు



మెట్టుగడ్డ నుంచి పరిమళగిరి ఆర్చ్ వరకు మెయిన్‌రోడ్డుపై పారుతున్న తాగునీరు

- వాటర్ ట్యాంకు వద్ద మొరాయించిన వాల్వ్
- 15 నిమిషాల్లోనే బాగు చేసిన మున్సిపల్ సిబ్బంది



ఇండస్ట్రియల్ ఏరియాలో..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఓవర్‌హెడ్ ట్యాంకు నిండి ఓవర్ ఫ్లో కావడంతో అర కిలోమీటరు మేర ప్రధాన రోడ్డుపై మిషన్ భగీరథ నీరు వృథాగా పారింది. జడ్చర్ల నుంచి మెయిన్ పైపులైన్ ద్వారా తాగునీటిని పంపింగ్ చేయగా ఆదివారం సాయంత్రం ఏడు గంటలకు ఇక్కడి వన్ ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఈ ట్యాంకు నిండింది. అయితే 15 నిమిషాల పాటు వాల్వ్ మొరాయించడంతో పూర్తిగా బంద్ కాలేదు. అనంతరం ఎలాగోలా మున్సిపల్ సిబ్బంది దానిని బాగు చేశారు. అప్పటికే ఇండస్ట్రియల్ ఏరియా మొదలుకుని జాతీయ రహదారి (ఎన్‌హెచ్–167)పై మెట్టుగడ్డ నుంచి పరిమళగిరి ఆర్చ్ వరకు తాగునీరు ఏరులై పారడంతో వాహనాదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై డీఈఈ బెంజమిన్‌ను వివరణ కోరగా కొద్ది సేపు ట్యాంకు వద్ద వాల్వ్ సరిగా పనిచేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆ తర్వాత దానిని బాగు చేయించి తాగునీరు బయటకు పోకుండా చూశామన్నారు.

కేంద్ర పథకాలతో అందరికీ న్యాయం



బీజేపీలో చేరిన మోట్లంపల్లి గ్రామస్తులు

ఆత్మకూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందని రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, రేచింతల శ్రీను అన్నారు. ఆదివారం పట్టణంలో బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మోట్లంపల్లికి చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని, ప్రపంచ దేశాలన్నీ మోదీ పాలనపై ఫిదా అవుతున్నాయని అన్నారు. బీజేపీ ప్రభుత్వంతోనే సుస్థిరపాలన సాధ్యమని, ప్రతి ఒక్కరికి న్యాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గాడిశేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, ఎల్లన్న, రాజు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి అవకాశం ఇవ్వండి

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీకి అవకాశం ఇవ్వాలని బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని రాయినిపల్లి, కొత్తపేటలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నారు. గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన పలువురు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. కొల్లాపూర్‌కు జాతీయ రహదారి, సోమశిల–సిద్దేశ్వరం బ్రిడ్జి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి నిధులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. విద్య, వైద్య, రవాణా, ఉపాధి రంగాల్లో నియోజకవర్గం అభివృద్ధి సాధించాలంటే అవకాశం కల్పించాలన్నారు.



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న సుధాకర్‌రావు